సాక్షి
మెదక్
సోమవారం ı 27 ı మే ı 2024

భక్తులతో సీఎస్ఐ చర్చి కిటకిట


ప్రార్థన చేస్తున్న భక్తులు

మెదక్‌జోన్: ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన మెదక్ సీఎస్ఐ చర్చి ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం వరకు రెండు పర్యాయాలు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఉదయం వేళలో చర్చి ప్రెసిబెటరీ ఇన్‌చార్జి శాంతయ్య భక్తులనుద్దేశించి దైవ సందేశం ఇచ్చారు. రెండవ ఆరాధనలో మతగురువు శ్రీనివాస్ పరలోక దేవుడి గురించి వివరించారు. కాగా దూరప్రాంతాల నుంచి వచ్చిన భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్చి నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు.

రమణీయం.. రథోత్సవం


రథోత్సవంలో భక్తుల సందడి, (ఇన్‌సెట్) స్వామివారి పల్లకీసేవలో ఎమ్మెల్యే సునీతారెడ్డి, రాజిరెడ్డి తదితరులు

కనులపండువగా దొంతి జాతర

శివ్వంపేట(నర్సాపూర్): మండల పరిధిలోని దొంతి జాతర అంగరంగ వైభవంగా సాగుతోంది. గ్రామంలో కొలువైన వేణుగోపాలస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం కీలక ఘట్టమైన రథోత్సవ వేడుకలను తెల్లవారుజామున కనుల పండువగా నిర్వహించారు. ఆలయ పూజారి వేణుగోపాలశర్మ ఆధ్వర్యంలో స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారి ఉత్సవ విగ్రహాన్ని పల్లకీపై దుర్గ మాత ఆలయం వరకు ఊరేగించారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తజనంతో గ్రామ పరిసరాలు నిండిపోయాయి. వేడుకల్లో ఎమ్మెల్యే సునీతారెడ్డి, ఆలయ ధర్మకర్తలు అమరేందర్‌రెడ్డి, వసకుమార్‌రెడ్డి, పీసీసీ కార్యదర్శి ఆవుల రాజిరెడ్డి, డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్, నాయకులు సుహాసినిరెడ్డి, కర్ణాకర్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అయితే రథోత్సవం సందర్భంగా బీఆర్ఎస్, కాంగ్రెస్ నాయకులు పోటాపోటీగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

న్యూస్‌రీల్

దొడ్డు వడ్లకు బోనస్ ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న మల్లేశం

మెదక్ కలెక్టరేట్: కొనుగోలు కేంద్రాల వద్ద రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మల్లేశం ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని కేవల్ కిషన్ భవన్‌లో సీపీఎం రాజకీయ శిక్షణ తరగతులను ప్రారంభించి మాట్లాడారు. జిల్లాలోని ఆయా గ్రామాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద ఇంకా రైతులు అవస్థలు పడుతూనే ఉన్నారని వాపోయారు. రాష్ట్ర ప్రభుత్వం సన్నరకం ధాన్యానికి మాత్రమే రూ.500 బోనస్ ఇస్తామని చెప్పడం సరికాదన్నారు. దొడ్డు రకం ధాన్యానికి కూడా బోనస్ ఇవ్వాలని కోరారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు నర్సమ్మ, మల్లేశం, బస్వరాజ్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రక్తదాతలకు సన్మానం

రామాయంపేట(మెదక్): రక్తదానం విషయంలో ప్రజల్లో మరింత చైతన్యం తీసుకురావడానికి గానూ జిల్లాలో ఎక్కువసార్లు రక్తదానం చేసిన వారిని సొసైటీ తరఫున సన్మానిస్తామని రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా చైర్మన్ ఏలేటి రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. ఈఏడాది మే 31లోగా 40 కంటే ఎక్కువ సార్లు రక్తదానం చేసిన వారిని ఎంపిక చేసి హైదరాబాద్‌లో సన్మానిస్తామని పేర్కొన్నారు. ఈమేరకు రక్తదానం చేసినవారు ఈనెలాఖరులోగా రామాయంపేట రెడ్‌క్రాస్ సొసైటీ పేరిట దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

కొనుగోలు కేంద్రం వద్ద అగ్ని ప్రమాదం


దగ్ధమైన వడ్లను చూపుతున్న రైతులు

కౌల్చారం(నర్సాపూర్): కొనుగోలు కేంద్రం వద్ద అగ్ని ప్రమాదం చోటు చేసుకున్న సంఘటన మండలంలోని పైతర గ్రామ శివారులో చోటు చేసుకుంది. వానాకాలం సాగు కోసం పొలాలు సిద్ధం చేస్తున్న రైతులు వరి కొయ్యలకు నిప్పు పెట్టారు. ఆదివారం సాయంత్రం వీచిన ఈదురుగాలులకు నిప్పు రవ్వలు సమీప కొనుగోలు కేంద్రంలోని కిష్టయ్య, భూమయ్యకు చెందిన ధాన్యం రాశులపై పడ్డాయి. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. అక్కడే ఉన్న రైతులు గమనించి మంటలను ఆర్పివేశారు. అప్పటికే కొంత మేర ధాన్యం కాలిపోయింది. తూకం వేసిన ధాన్యాన్ని త్వరగా రైస్ మిల్లులకు తరలించాలని రైతులు డిమాండ్ చేశారు.

సీఎంఆర్‌పై సీరియస్

బుక్కిన ధాన్యం కక్కాల్సిందే
- 10 మిల్లర్లపై క్రిమినల్ కేసులు.. ఆస్తుల అటాచ్‌మెంట్
- 17 మంది నుంచి వసూళ్లకు చర్యలు

> 'ఇటీవల మిల్లర్లు పాపన్నపేటలో బినామీ రైస్‌మిల్లు పేరిట సంబంధం లేని ఓ వ్యక్తి పేరు పెట్టి జిల్లా అధికారులంతా లంచగొండులని.. తమను వేధింపులకు గురి చేస్తున్నారని, జరిమానాలు, వడ్డీలు విధిస్తూ ఆస్తులు జప్తు చేస్తున్నారని, ఆర్ఆర్‌యాక్ట్ ఉపయోగించి భయభ్రాంతులకు గురి చేస్తున్నారని సీఎంకు ఫిర్యాదు చేశారు'. అయితే మీరెన్ని తప్పుడు ఫిర్యాదులు చేసినా బుక్కిన బియ్యం కక్కేదాక వదిలిపెట్టమని అధికారులు అవినీతి మిల్లర్లపై కొరడా ఝుళిపిస్తున్నారు. 25 శాతం జరిమానాతో పాటు వడ్డీ కలిపి బకాయిల వసూళ్ల కోసం క్రిమినల్ కేసులు నమోదు చేస్తున్నారు. ఆర్ఆర్ యాక్ట్ కింద ముక్కు పిండి కక్కిస్తున్నారు.

పాపన్నపేట(మెదక్): జిల్లాలో మొత్తం 160 రైస్ మిల్లులు ఉన్నాయి. 2022- 23కు సంబంధించి ప్రభుత్వం కస్టమ్స్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) కింద మిల్లులకు ధాన్యం ఇచ్చింది. క్వింటాల్‌కు 67 కిలోల చొప్పున బియ్యం పౌర సరఫరాల శాఖకు తిరిగి ఇవ్వాలి. ఇందుకు మిల్లింగ్ చార్జి కింద ప్రభుత్వం క్వింటాల్ ధాన్యానికి రూ.35 చెల్లిస్తోంది. అయితే అప్పట్లో అధికారుల నిర్లక్ష్యాన్ని ఆసరాగా చేసుకున్న మిల్లర్లు వారితో మిలాఖత్ అయి బియ్యం ఇవ్వకుండానే వేలాది మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని బహిరంగంగా అమ్ముకున్నారు. పైసా పెట్టుబడి పెట్టకుండా ప్రభుత్వం ఇచ్చిన ధాన్యం అమ్ముకొని వచ్చిన లక్షలాది రూపాయల ప్రభుత్వ సొమ్మును రియల్ ఎస్టేట్, ఇతర వ్యాపారాల్లో పెట్టుబడులు పెట్టారన్న ఆరోపణలు ఉన్నాయి. తీరా లెక్కలు తీసి బియ్యం అడిగే సరికి కొంత మంది మిల్లర్లు చేతులెత్తేశారు.

బకాయిలు సుమారు రూ.126 కోట్లు

నర్సాపూర్ ప్రాంతంలోని వెంకటేశ్వర ఇండస్ట్రీస్, శివసాయి, శ్రీపాద ఈ మూడు రైస్ మిల్లులను నడిపిన ఓ యజమాని 17,777 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని తీసుకొని ఒక్క గింజ లేకుండా బయట అమ్ముకున్నట్లు అధికారులు గుర్తించారు. అప్పట్లో అతనికున్న రాజకీయ పలుకుబడితో ఏ అధికారి ఒత్తిడి తేలేకపోయారు. కానీ ఇటీవల ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంతో అధికారులు అతని మిల్లులపై క్రిమినల్ కేసులు నమోదు చేశారు. ఆస్తులను వేలం వేశారు. అతడు రూ.56,62,72,911 బకాయి ఉండగా రూ.17,23,21,300 వసూలు చేశారు. మిగితా రూ.39,39,51,611 బకాయిలు రావాల్సి ఉంది. వీటితో పాటు మహాలక్ష్మి బిన్నీ రైస్ మిల్, వీరభద్ర ఇండస్ట్రీస్ (నర్సాపూర్), భవాని రైస్‌మిల్ (రామాయంపేట) సాయి సంతోషి ఇండస్ట్రీస్ (పాతూర్) శారద ట్రేడర్స్ (హవేళిఘనపూర్), చాముండేశ్వరి ట్రేడర్స్ (సర్ధన), సాయి కృపా (పాపన్నపేట) మిల్లర్ల మొండి బకాయిలను ముక్కు పిండి వసూలు చేసేందుకు అధికారులు క్రిమినల్ కేసులు, ఆర్ఆర్ యాక్ట్ ఉపయోగిస్తున్నారు. అయినా సరైన స్పందన లేకపోవడంతో ఆస్తులను సైతం అటాచ్ చేస్తున్నారు. ఈ పది మిల్లుల నుంచి రూ.112,91,65,741 బకాయిలు వసూలు కావాల్సి ఉంది. ఇవి కాక జిల్లాలోని మరో 17 మిల్లుల నుంచి రూ.16,43,74,711 రావాల్సి ఉండగా రూ.3,52,50,000 వసూలు చేశారు. ఇంకా రూ.12,92,24,711 బకాయిలు ఉన్నట్లు సివిల్ సప్లై అధికారులు చెబుతున్నారు. వీరి నుంచి 25 శాతం జరిమానాతో పాటు వడ్డీ కలిపి వసూలు చేసేందుకు కలెక్టర్ ఆధ్వర్యంలో అధికారులు తీవ్ర చర్యలకు సిద్ధం అవుతున్నారు.


పాపన్నపేట మండలంలోని ఓ రైస్ మిల్లు

రికవరీ చేసి తీరుతాం



ఎన్ని ఒత్తిళ్లు వచ్చినా తట్టుకుంటాం. మిల్లర్ల నుంచి రావాల్సిన బకాయిలను జరిమానా, వడ్డీతో కలిపి వసూలు చేసి తీరుతాం. కమిషనర్ ఉత్తర్వులకు అనుగుణంగా ముందుకు సాగుతాం. కొంతమంది మిల్లర్లు బినామీ పేర్లతో తప్పుడు ఆరోపణలు చేసి నైతిక స్థైర్యాన్ని దెబ్బ తీసే ప్రయత్నం చేస్తున్నారు. అయినా వాటిని పట్టించుకోం. ఇప్పటివరకు 10 మిల్లర్లపై క్రిమినల్ కేసులు నమోదు చేశాం. మరో 17 మిల్లర్ల నుంచి బకాయిలు వసూలు చేస్తున్నాం. బకాయిల రికవరీలో పురోగతి సాధిస్తున్నాం. ప్రభుత్వానికి సంబంధించిన ఒక్క రూపాయి వదిలేది లేదు.

– హరికృష్ణ, డీఎం, సివిల్ సప్లై

విద్యాధరి నమోస్తుతే..


వర్గల్ క్షేత్రంలో చిన్నారుల అక్షర స్వీకారాల సందడి

అక్షరదేవతకు లక్ష పుష్పార్చన
- నేత్రపర్వంగా మూల మహోత్సవం
- భారీగా అక్షరాభ్యాసాలు
- వర్గల్ క్షేత్రంలో భక్తి పారవశ్యం

వర్గల్(గజ్వేల్): సుప్రసిద్ధ వర్గల్ విద్యాసరస్వతి క్షేత్రం ఆదివారం మూల మహోత్సవ వైభవంతో అలరారింది. విద్యాప్రదాయనికి భక్తజన సామూహిక లక్షపుష్పార్చన నేత్రపర్వం చేసింది. పెద్ద సంఖ్యలో చిన్నారులకు అక్షరస్వీకారాలు జరిగాయి. జన్మ నక్షత్రవేళ అమ్మవారి దివ్యమంగళ రూపం దర్శించుకుని భక్తులు తరించారు. తెల్లవారుజామున ఆలయ వ్యవస్థాపక చైర్మన్ చంద్రశేఖర సిద్ధాంతి నేతృత్వంలో వేదపండితులు అమ్మవారి మూలవిరాట్టుకు విశేష పంచామృతాభిషేకం నిర్వహించారు. పట్టువస్త్రాలు, పూల మాలలు, ఆభరణాలతో కమనీయంగా అలంకరించారు. చతుషష్ట్యోపచార పూజలు, సామూహిక లక్షపుష్పార్చన చేశారు. ఆలయ యాగ మండపంలో చండీ హోమం నిర్వహించారు. అక్షరాభ్యాస మండపంలో చిన్నారులకు అక్షరాభ్యాసాలు జరిపించారు. హైదరాబాద్‌కు చెందిన కొనతం శ్రీనివాస్‌రెడ్డి, అరుణ దంపతులు అమ్మవారికి వెండి పుష్పం బహుకరించారు. జంటనగరాలు, ఉమ్మడి జిల్లాల నుంచి తరలివచ్చిన భక్తులు వేడుకలు తిలకించి తరించారు. తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

విదేశీ.. వి'హంగామా'



జిల్లాకు విదేశీ అతిథులొచ్చాయి. అందోల్ మండలం అల్మాయిపేట చెరువు వద్ద సైబీరియన్ పక్షులు సందడి చేశాయి. ఖండాలు, సముద్రాలు దాటుకొని ఆహారం కోసం ఇక్కడికి వచ్చి చేరాయి. చెరువులో నీళ్లు తక్కువగా ఉండటంతో చేపల వేట సాగిస్తున్నాయి. ఈ వింత పక్షులను తిలకించేందుకు పరిసర గ్రామాల ప్రజలు వస్తున్నారు. వీటి రాకతో వర్షాలు కురిసి.. పంటలు సమృద్ధిగా పండుతాయని ప్రజలు నమ్ముతారు.

– సాక్షి స్టాఫ్ ఫొటోగ్రాఫర్, సంగారెడ్డి

ప్రజాదరణ ఓర్వలేకే విమర్శలు


మాట్లాడుతున్న ఆంజనేయులుగౌడ్

డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్

నర్సాపూర్: కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు అన్యాయం చేస్తుందని ఎమ్మెల్యే సునీతారెడ్డి విమర్శించడం సరికాదని డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్ అన్నారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. నమ్ముకున్న కాంగ్రెస్ కార్యకర్తలను నట్టేట ముంచి తన స్వలాభం కోసం పార్టీ మారారని ఆరోపించారు. తమ పార్టీకి వస్తున్న ప్రజాదరణ చూసి ఓర్వలేకే అనవసర ఆరోపణలు చేస్తున్నాయని మండిపడ్డారు. ధాన్యం కొనుగోలు పకడ్బందీగా సాగుతోందని, ఇతర జిల్లాలకు సైతం వడ్లు తరలిస్తున్నట్లు చెప్పారు. నర్సాపూర్ నియోజకవర్గంలో మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావుకు అనుచరులు ఉన్నారని, పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఏం అభివృద్ధి చేశారని ప్రశ్నించారు. నర్సాపూర్‌కు వచ్చిన నిధులన్నింటిని హరీశ్‌రావు సిద్దిపేట, గజ్వేల్‌కు మళ్లించారని ఆవేదన వ్యక్తం చేశారు. నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి మాట్లాడుతూ.. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ నాయకులు అడ్డగోలుగా డబ్బు మద్యం పంచి పెట్టారని మండిపడ్డారు. నర్సాపూర్‌ను అభివృద్ధి చేసేందుకు సిద్ధంగా ఉన్నామని, మొదట అందరికీ రేషన్‌కార్డుల అందజేస్తామని తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు ఒక్క సీటు రాదని ఎద్దేవా చేశారు. సమావేశంలో నాయకులు సుహాసినిరెడ్డి, కరుణాకర్‌రెడ్డి, శ్రీనివాస్‌గుప్తా, వెంకట్రామిరెడ్డి, సురేష్, అశోక్‌గౌడ్, నవీన్‌గుప్తా, వేణుగోపాల్‌రెడ్డి, అజ్మత్, నర్సింహాచారి తదితరులు పాల్గొన్నారు.

భానుడి భగభగ

మెదక్‌జోన్: జిల్లాలో మళ్లీ భానుడి భగభగలు మొదలయ్యాయి. పది రోజులుగా వానలతో కొంతమేర తగ్గిన ఉష్ణోగ్రత ఆదివారం పెరిగింది. ఏకంగా 44.4 డిగ్రీలుగా నమోదైంది. సాయంత్రం పలు చోట్ల ఈదురుగాలులు బీభత్సం సృష్టించాయి.

దేవుని భూములకు రక్షణ

- అన్యాక్రాంతం కాకుండా గట్టి చర్యలు
- జిల్లాలో 88 ఆలయాల పరిధిలో 1,390 ఎకరాలు



మెదక్‌జోన్: దేవాలయాల భూములు అన్యాక్రాంతం కాకుండా గట్టి చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. ఇటీవల ఆశాఖ మంత్రి కొండా సురేఖ ఆదేశాలు జారీ చేయడంతో భూముల వ్యవహారం తెరపైకి వచ్చింది. వాటికి సంబంధించిన రికార్డులను సంబంధిత శాఖ అధికారులు సరిచూసే పనిలో నిమగ్నమయ్యారు.

జిల్లాలో 88 ఆలయాలకు సంబంధించి 1,390 ఎకరాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో ఆలయాల భూముల పక్కన ఉన్న రైతులు హద్దురాళ్లు చెరిపేసి వారి భూముల్లో కలుపుకోవడం, కౌలుకు తీసుకున్న వారు సరైన కౌలు ఇవ్వకపోవడం, పంటలు పండినా పండలేదంటూ కౌలు చెల్లించడం లేదు. దీంతో పాటు ప్రధానంగా రెవెన్యూ రికార్డుల్లో ఉన్న లొసుగులను ఆధారంగా చేసుకొని కొందరు వారి పేరున పట్టా మార్పిడి చేసుకోవడం లాంటి ఘటనలు గతంలో జిల్లాలో అక్కడక్కడ వెలుగు చూశాయి. ప్రస్తుతం అలాంటి పరిస్థితులు చోటుచేసుకోకుండా ఆలయాల భూములకు గట్టి భద్రత కల్పించాలనే ఉద్దేశంతో ఆశాఖ మంత్రి కొండా సురేఖ ఇటీవల సంబంధిత అధికారులతో సమీక్ష ఏర్పాటు చేశారు. దీంతో అధికారులు భూముల వివరాలు సేకరించే పనిలో నిమగ్నమయ్యారు.

ధరణిలో 800 ఎకరాలు

జిల్లావ్యాప్తంగా దేవాలయాల భూములు 1,390 ఎకరాలకు గానూ 800 ఎకరాలు ధరణి పోర్టల్‌లో పొందుపర్చారు. ఈ లెక్కన ఇంకా 590 ఎకరాలు పాత పాస్ పుస్తకాల్లో దేవాలయాల పేర్లతోనే ఉన్నాయి. కాగా గత ప్రభుత్వం ధరణి పోర్టల్ తేవడంతో పాత రికార్డులు మూలనపడ్డాయి. మిగితా 590 ఎకరాలు అలాగే ఉన్నాయి..? అవి కబ్జాకు గురయ్యాయా అనే వివరాలను సేకరించే పనిలో అధికారులు ఉన్నారు.

వృథా భూముల్లో సోలార్ ప్లాంట్లు

దేవాలయాల భూములు మొత్తం 1,390 ఎకరాలు ఉండగా వాటిలో 900 ఎకరాలను ఇతరులకు కౌలుకు ఇచ్చినట్లు ఆశాఖ అధికారులు చెబుతున్నారు. ఈ లెక్కన ఇంకా 490 ఎకరాలు పడావు ఉన్నాయి. ఈ భూములను వృథాగా ఉంచకుండా వాటిలో సోలార్ ప్లాంట్లు ఏర్పాటు చేసి విద్యుత్‌ను విక్రయించాలని యోచిస్తున్నారు. వచ్చే ఆదాయంతో దేవాలయాలను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేయడంతో ఆ దిశగా అధికారులు అడుగులు వేస్తున్నారు. నర్సాపూర్ ప్రాంతంలోని లక్ష్మీనరసింహా ఆలయానికి 150 ఎకరాల భూములు ఉన్నాయి. అవి ప్రస్తుతం పడావుగా ఉండడతో ఆ భూమిలో సోలార్ ప్లాంట్ ఏర్పాటు చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు.

త్వరలోనే అమల్లోకి..

> జిల్లాలోని దేవాలయాల భూములను ఇతరులెవరు వారి పేరున మార్చుకునే వీలు లేకుండా రిజిస్ట్రేషన్‌లోని సెక్షన్ 22లో భూముల వివరాలు పొందుపర్చాం. దేవుళ్ల పేరునే భూములను మార్చేందుకు ధరణి పోర్టల్‌లో మార్పులు చేయాలని ఇటీవల దేవాదాయశాఖ మంత్రి ఆదేశాలు జారీ చేశారు. త్వరలోనే అది అమల్లోకి వచ్చే అవకాశం ఉంది.
>
> – శివరాజు, దేవాదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్

దుర్గమ్మ ఆలయం.. భక్తజన శోభితం


అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు, (ఇన్‌సెట్) ప్రత్యేక అలంకరణలో దుర్గమ్మ

పాపన్నపేట(మెదక్): మండుతున్న ఎండలను లెక్క చేయకుండా ఆదివారం వేలాది భక్తులు తరలిరావడంతో ఏడుపాయల జనారణ్యంగా మారింది. తెల్లవారు జామునే అర్చకులు వన దుర్గమ్మను ప్రత్యేకంగా అలంకరించి కుంకుమ అర్చనతో అభిషేకం చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు బారులు తీరి అమ్మవారిని దర్శించుకున్నారు. ఒడి బియ్యం, బోనాలు తీసి మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ చైర్మన్ బాలాగౌడ్, ఈఓ మోహన్‌రెడ్డి భక్తులకు ఇబ్బంది కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

క్లుప్తంగా

రేణుక ఎల్లమ్మ సన్నిధిలో అదనపు కలెక్టర్‌ పూజలు



ప్రత్యేక పూజలు చేస్తున్న శ్యాంప్రసాద్‌ దంపతులు

హుస్నాబాద్‌: రేణుక ఎల్లమ్మ జాతర సందర్భంగా ఆదివారం పెద్దపల్లి అదనపు కలెక్టర్‌ గాజుల శ్యాంప్రసాద్‌ లాల్‌, మాధవి దంపతులు ఆలయంలో అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు. అమ్మవారికి ఒడి బియ్యం పోసి మొక్కులు సమర్పించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్‌ పూదరి లక్ష్మీనారాయణ భక్తులకు నీటి సౌకర్యం లేక ఇబ్బందులు పడుతున్నారని, వేసవి కాలం కావడంతో స్నానాలు, వంటలకు అవస్థలు ఎదుర్కొంటున్నారని అదనపు కలెక్టర్‌ దృష్టికి తెచ్చారు. వెంటనే స్పందించిన ఆయన ఈ రోజే బోరు వేయించాలమని అధికారులు తెలిపారు.

కరాటే పోటీల్లో ప్రతిభ



బెల్టులతో విద్యార్థులు

నర్సాపూర్‌: కరాటే పోటీల్లో విద్యార్థులు ప్రతిభ కనబర్చడంతో బెల్టులు అందజేసినట్లు పోటీల నిర్వాహకుడు అశోక్‌ తెలిపారు. ఆదివారం పట్టణంలోని పిల్లల పార్కులో కరాటే పోటీలు నిర్వహించారు. రెంజుకీ చోటోఖాన్‌ కరాటే క్లబ్‌ ఆఫ్‌ ఇండియా ఫౌండర్‌ అండ్‌ డైరెక్టర్‌ నగేశ్‌ పోటీలకు ఎగ్జామినర్‌గా వ్యవహరించారన్నారు. పోటీల అనంతరం డీసీసీ అధ్యక్షుడు ఆంజనేయులు గౌడ్‌, నియోజకవర్గ ఇన్‌చార్జి ఆవుల రాజిరెడ్డి చిన్నారులకు బెల్టులు అందజేసినట్లు పేర్కొన్నారు.

ఇద్దరు వేటగాళ్ల అరెస్ట్‌


ముళ్ల పంది కళేబరం స్వాధీనం



పోలీసుల అదుపులో వేటగాళ్లు

రామాయంపేట(మెదక్‌): అటవీ ప్రాంతంలో వన్యప్రాణి ముళ్ల పందిని వేటాడిన ఇద్దరు నిందితులను అరెస్ట్‌ చేశారు. డిప్యూటీ రేంజ్‌ అధికారి ఖుద్బొద్దీన్‌ కథనం మేరకు.. కామారెడ్డి జిల్లా బిక్కనూర్‌ మండలం భాగిర్తిపల్లి గ్రామానికి చెందిన నేల శ్రీహరి, వెల్దుర్తికి చెందిన ఆశాల సంతోష్‌ అటవీ ప్రాంతంలో ముళ్ల పందిని వేటాడి దాని కళేబరాన్ని బైక్‌పై తరలిస్తున్నారు. శనివారం రాత్రి రామాయంపేట వద్ద పట్టుకున్నారు. ఈ మేరకు కళేబరానికి స్థానిక వెటర్నరీ ఆస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించి అనంతరం కాల్చివేశారు. నిందితులను అరెస్ట్‌ చేసి కోర్టుకు తరలించగా రిమాండ్‌ విధించారు. ఖుద్బొద్దీన్‌తోపాటు బీట్‌ అధికారులు నవీన్‌, రమేశ్‌ను జిల్లా అటవీ అధికారి రవిప్రసాద్‌, రేంజీ అధికారి విద్యాసాగర్‌ ప్రశంసించారు.

జింకను కాపాడిన గ్రామస్తులు



జింకకు చికిత్స చేస్తున్న వైద్యులు

మునిపల్లి(అందోల్‌): ప్రాణాపాయ స్థితిలో ఉన్న జింకను అంతారం గ్రామస్తులు కాపాడారు. మండలంలోని అంతారం గ్రామ సమీపంలో ఆదివారం జింక తీవ్ర గాయాలై ప్రాణాపాయ స్థితిలో కనిపించింది. వెంటనే గ్రామస్తులు ఎడ్ల శంకర్‌, ఎంపీడీఓ హరినందన్‌రావు, పశువైద్యాధికారి సంతోష్‌కు సమాచారం ఇవ్వగా వచ్చి వైద్యం చేశారు. అనంతరం ఎంపీడీఓ జిల్లా అటవీ శాఖ అధికారి శ్రీధర్‌రావుకు విషయం చెప్పడంతో జింకను తీసుకెళ్లారు.

‘పట్టు’ సాధిస్తే లాభాలే..

పరిశ్రమ వైపు రైతుల అడుగులు

- పెరిగిన మల్బరీ సాగు విస్తీర్ణం
- ఉమ్మడి జిల్లాలో 1,800 ఎకరాలు
- సబ్సిడీపై గుడ్లు, పరికరాలు అందిస్తున్న కేంద్రం
- క్షేత్రస్థాయిలో అవగాహన కల్పిస్తున్న అధికారులు



సిద్దిపేటలోని చంద్లాపూర్‌లో మల్బరీ సాగు చేస్తున్న రైతు

పట్టు పరిశ్రమ రంగం రైతులకు లాభదాయకంగా మారుతోంది. ఉమ్మడి మెదక్‌ జిల్లాలోని రైతులు ఈ పరిశ్రమ వైపునకు మొగ్గు చూపుతున్నారు. సాంప్రదాయ సాగుకు భిన్నంగా యువ రైతులు వాణిజ్య సాగుపై ఉత్సాహం కనబరుస్తున్నారు. ఈ క్రమంలో వందల ఎకరాల్లో మల్బరీ సాగు చేస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం సైతం పరికరాలకు సబ్సిడీ అందిస్తుంది. రానున్న సంవత్సరంలో ఉమ్మడి జిల్లాలో పట్టు పరిశ్రమ మరింతగా అభివృద్ధి చెందే అవకాశం ఉందని పట్టు పరిశ్రమ శాఖ అధికారులు చెబుతున్నారు.

- ప్రశాంత్‌నగర్‌(సిద్దిపేట)

సిద్దిపేట జిల్లాలో 1,127 ఎకరాల్లో, సంగారెడ్డి జిల్లాలో 350 ఎకరాల్లో, మెదక్‌ జిల్లాలో 323 ఎకరాల్లో మొత్తం ఉమ్మడి మెదక్‌ వ్యాప్తంగా ఈ ఏడాది 1,800 ఎకరాల్లో మల్బరీ సాగు అవుతుంది. గతేడాది కంటే ఈ సంవత్సరం ఈ సాగు 100 ఎకరాల్లో పెరిగినట్టు ఉమ్మడి మెదక్‌ జిల్లా పట్టు పరిశ్రమ ఉప సంచాలకులు తెలిపారు. మిగితా సాంప్రదాయ పంటలు సాగు చేయడం వల్ల రైతులు అధికంగా వ్యయ ప్రయాసాలకు, అతివృష్టి, అనావృష్టిలకు గురి అవడంతో నష్టం వాటిల్లుతుంది. అందుకు బహువార్షిక పంటైన మల్బరీ సాగుతో పట్టు పురుగులను పెంచడం వల్ల అధిక లాభాలు వస్తాయని రైతులు ఇప్పుడిప్పుడే అవగాహన ఏర్పర్చుకుంటున్నారు. దీంతో మల్బరీ సాగు విస్తీర్ణం పెరుగుతుంది. రైతులు ఇతర పంటల వైపుకు పోకుండా పట్టు వైపునకు దృష్టి సారిస్తున్నారు.

పని భారం తక్కువ..

మల్బరీ సాగు బహువార్షిక పంట అవడం వల్ల రైతులకు పెట్టుబడి ఖర్చు అధికంగా తగ్గుతుంది. ఈ మల్బరీ 15 నుంచి 20 ఏళ్ల వరకు ఉంటుంది. ఈ పంటకు నీటి వినియోగం కూడా తక్కువే. 10 గుంటల వరి సాగుకు అయ్యే నీటితో 2 ఎకరాల్లో మల్బరీని సాగు చేయొచ్చు. అలాగే మిగితా సాంప్రదాయ పంటలైన మొక్కజొన్న, వరి, పత్తి మొదలగు పంటలకు వ్యవసాయ కార్మికులు అధికంగా అవసరమవుతారు. కానీ ఈ పట్టు పరిశ్రమకు తక్కువ మంది కార్మికులతో పూర్తి చేయొచ్చు. దీంతో రైతులు ఈ పట్టు వైపునకు మొగ్గు చుపూతున్నారు.

కేంద్ర ప్రభుత్వం సబ్సిడీలు

కేంద్ర ప్రభుత్వం పట్టు పరిశ్రమను ప్రోత్సహించడంలో భాగంగా రైతులకు సబ్సిడీలు అందిస్తుంది. ముఖ్యంగా పట్టు పురుగులను పెంచేందుకు నిర్మించే షెడ్డుకు, లోపల నిర్మించే సెల్ఫ్‌కు, అదే విధంగా మందులు, పట్టు గుడ్లను రైతులకు సబ్సిడీపై అందిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం సబ్సిడీ ఇతర రూపాల్లో అధికంగా సాయం చేయడంతో పట్టు పరిశ్రమ రంగంవైపు అడుగులు వేస్తున్నారు.



ఓ రైతు పెంచుతున్న పట్టు పురుగులను పరిశీలిస్తున్న అధికారులు

విక్రయ కేంద్రాలు అందుబాటులో..

పట్టు పురుగుల ద్వారా ఉత్పత్తి అయిన పట్టుగుళ్లను విక్రయించేందుకు విక్రయ కేంద్రాలు జనగాం, తిరుమలగిరిలో మార్కెట్‌లు అందుబాటులో ఉన్నాయి. పట్టుగుళ్ల నాణ్యత తగ్గక ముందుకే వాటిని విక్రయించేందుకు అవకాశం లభిస్తుంది. దీనికి తోడుగా పట్టు పరిశ్రమశాఖ అధికారులు కూడా గ్రామాల్లో క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ రైతులకు అవగాహన కల్పిస్తున్నారు. కేంద్ర ప్రభుత్వం అందించే సబ్సిడీలు, ఇతర మౌలిక సౌకర్యాల గురించి వివరిస్తున్నారు.

కేజీకి రూ.450 నుంచి 500 వరకు



ఒక సంవత్సరానికి 1,250 పట్టు గుడ్లతో 900 కిలోల పట్టు ఉత్పత్తి అవుతుంది. ప్రస్తుతం పట్టు పురుగులు కేజీకి రూ.450-500 వరకు మద్దతు ధర పలుకుతుంది. దీంతో ఉమ్మడి జిల్లాలోని పట్టు రైతులను స్ఫూర్తిగా తీసుకొని ఇతర జిల్లాలోని ఇతర సాధారణ పంటలు సాగు చేసే రైతులు సైతం పట్టు వైపునకు చూస్తున్నారు. దీంతో రానున్న సంవత్సరాల్లో ఉమ్మడి మెదక్‌ జిల్లా పట్టు ఉత్పత్తిలో ఉన్నత స్థానంలో ఉండనుంది.

అధిక లాభాలు సాధించొచ్చు



రైతులు సాంప్రదాయ పంటల సాగు కంటే నూతన వ్యవసాయ సాగులు చేపట్టాలి. దీంతో అధికంగా ఆర్థికంగా వృద్ధి సాధించవచ్చు. పెట్టుబడి తగ్గించి దిగుబడి పెంచే పంటల వైపు రైతులు సాగాలి. ఉమ్మడి మెదక్‌ జిల్లాలో రైతులు పట్టుపై అధిక ఆసక్తిని కనబరుస్తున్నారు. పట్టుతో రైతులకు అధిక లాభాలు చేకూరుతాయి.

-ఇంద్రసేనారెడ్డి, ఉమ్మడి మెదక్‌ జిల్లా పట్టు పరిశ్రమ ఉప సంచాలకులు

నాలుగు ఎకరాల్లో సాగు..



నేను సాంప్రదాయ పంటలకు బదులుగా మల్బరీ సాగు చేసి, పట్టు గూళ్లు పెంచుతున్నాము. నాకున్న నాలుగు ఎకరాల్లో మల్బరీ సాగు చేస్తున్నాను. ఇతర పంటల మాదిరిగా కాకుండా ప్రతి నెలా పట్టు గుళ్లను విక్రయించే అవకాశం ఉంటుంది. ఇతర పంటలకు పెట్టే పెట్టుబడిలో 20 శాతం పెట్టుబడితో అధిక దిగుబడి సాధిస్తున్నాను.

-పిల్లి శ్రీనివాస్‌ రైతు, చంద్లాపూర్‌, సిద్దిపేట జిల్లా

పశువులపై హైనా దాడి



గాయాలతో దూడ

చిన్నకోడూరు(సిద్దిపేట): రెండు పశువులపై హైనా దాడి చేసి గాయపర్చిన ఘటన మండల పరిధిలోని మెట్‌పల్లిలో ఆదివారం తెల్లవారు జామున చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. గ్రామానికి చెందిన పట్నం బాలయ్య దూడను, కొరిమి రాజు తన ఆవును రోజు మాదిరిగా పొలం వద్ద పాకలో కట్టేసి ఇంటికి వచ్చారు. ఆదివారం ఉదయం రైతులు పొలం వద్దకు వెళ్లగా బాలయ్య దూడ, రాజు ఆవు గాయాలై ఉన్నాయి. వెంటనే పశువైద్యాధికారికి సమాచారం అందించారు. వైద్యురాలు మంజుల అక్కడకు చేరుకొని చికిత్స అందించారు. ఫారెస్టు సెక్షన్‌ ఆఫీసర్‌ బుచ్చయ్య ఘటనా స్థలాన్ని పరిశీలించారు. రాత్రి మెట్‌పల్లి శివారులో బోను ఏర్పాటు చేస్తామని, ఫ్లాష్‌ కెమెరాలు అమర్చుతామన్నారు. ఎవరూ ఆందోళన చెందొద్దని సూచించారు.

ఏడో అంతస్తుపై నుంచి పడి..

వలస కార్మికుడు మృతి



మామిజుల్‌ షేక్‌ మృతదేహం

పటాన్‌చెరు టౌన్‌: ఏడో అంతస్తు పై నుంచి పడి కార్మికుడు మృతి చెందిన ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ ఆసిఫ్‌ అలీ కథనం ప్రకారం.. పశ్చిమ బెంగాల్‌కు చెందిన మామిజుల్‌ షేక్‌(33) మూడు నెలల కిందట బతుకుదెరువు కోసం వచ్చి పటాన్‌చెరు శివారులోని నిర్మాణంలో ఉన్న భవనాలకు ప్లాస్టింగ్‌ వర్క్‌ చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. ఆదివారం ఏడవ అంతస్తులో గోడకు ప్లాస్టింగ్‌ వర్క్‌ చేస్తుండగా ప్రమాదవశాత్తు జారి కింద పడటంతో తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం తెలుసుకున్న పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం పటాన్‌చెరు ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. యజమాని సరైన జాగ్రత్తలు తీసుకోకపోవడంతోనే కార్మికుడు మృతి చెందాడని వెస్ట్‌ బెంగాల్‌ గ్రామస్తుడైన షేక్‌ లాల్చంద్‌ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తండ్రి కళ్లెదుటే కొడుకు మృతి

- ప్రమాదవశాత్తు కుంటలో పడ్డ పదేళ్ల బాలుడు
- సంగారెడ్డి జిల్లా జిన్నారంలో ఘటన



వినోద్‌ (ఫైల్‌)

జిన్నారం(పటాన్‌చెరు): కన్న తండ్రి ముందే కొడుకు నీటిలో మునిగిపోయాడు. తండ్రికి ఈత రాకపోవడంతో కుమారుడిని కాపాడుకోలేకపోయాడు. ఈ ఘటన సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం గుమ్మడిదల గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గుమ్మడిదల గ్రామానికి చెందిన స్వామి, నాగమణిలకు కుమారుడు వినోద్‌(10), కుమార్తె రజిత ఉన్నారు. స్వామి కుమారుడు వినోద్‌తో కలిసి గేదెలను మేపేందుకు గ్రామ శివారులోకి వెళ్లాడు. గేదెలు మేపుతున్న సమయంలో సమీపంలోని బ్రాహ్మణ కుంటలోకి గేదెలు నీళ్లు తాగేందుకు వెళ్లాయి. గేదెల వెంటనే వినోద్‌ కూడా వెళ్లి ప్రమాదవశాత్తు కాలు జారి కుంటలోకి పడిపోయాడు. తండ్రి వినోద్‌ను కాపాడేందుకు ప్రయత్నించినా ఫలితం లేకుండా పోయింది. తండ్రికి ఈత రాకపోవడంతో కుంటలోకి దిగలేకపోయాడు. కళ్ల ఎదుటే కుమారుడు మృతి చెందడంతో ఆ తండ్రి బాధ వర్ణణాతీతం. ఈ ఘటనతో గుమ్మడిదల గ్రామంలో విషాదం చోటు చేసుకుంది.



మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

గుర్తు తెలియని మృతదేహాలు లభ్యం

మనోహరాబాద్‌(తూప్రాన్‌): రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందిన ఘటన మనోహరాబాద్‌ పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. ఆదివారం ఎస్‌ఐ కరుణాకర్‌రెడ్డి కథనం మేరకు.. మండలంలోని కూచారం గ్రామ శివారులో జాతీయ రహదారి-44పై శనివారం రాత్రి గుర్తు తెలియని వాహనం ఢీ కొని గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. మృతుడిపై వాహనాలు వెళ్లడంతో మృతదేహం నుజ్జునుజ్జు అయ్యింది. గ్రామ కార్యదర్శి వేణుగోపాల్‌రెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రైలు పట్టాల వద్ద..

రైల్వే పట్టాల వద్ద గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. కామారెడ్డి రైల్వే ఎస్‌ఐ తావునాయక్‌ ఆదివారం తెలిపిన వివరాల ప్రకారం.. మనోహరాబాద్‌ మండల కేంద్రం రైల్వే స్టేషన్‌ నుంచి గజ్వేల్‌ వెళ్లే పట్టాల మార్గమధ్యలో రామాయపల్లి శివారులో గుర్తు తెలియని వృద్ధుని శవం లభ్యమైనట్లు తెలిపారు. మృతుడి వివరాలు తెలిసిన వారు కామారెడ్డి రైల్వే పోలీసులను సంప్రదించాలన్నారు.

వేర్వేరు చోట్ల నలుగురు ఆత్మహత్య

కుమారుడు చనిపోయాడనే బాధతో మద్యానికి బానిసై తండ్రి..



షాదు(ఫైల్‌)

వర్గల్‌(గజ్వేల్‌): కొడుకు మృతితో మనోవేదనకు గురై మద్యానికి బానిసైన ఓ తండ్రి ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషాదకర ఘటన ఆదివారం వర్గల్‌ మండల కేంద్రంలో వెలుగుచూసింది. గౌరారం ఎస్‌ఐ శివకుమార్‌ తెలిపిన వివరాల ప్రకారం.. వర్గల్‌కు చెందిన బోయిని షాదు(35), మాధవి దంపతులకు శశికాంత్‌, యశ్వంత్‌ ఇద్దరు కుమారులు. మూడేళ్ల కిందట చిన్న కుమారుడు యశ్వంత్‌ ప్రమాదంలో చనిపోయాడు. అప్పటి నుంచి తండ్రి షాదు కుమారుడిని తలచుకుంటూ మనోవేదనకు గురై మద్యానికి బానిసయ్యాడు. శనివారం రాత్రి మద్యం తాగి ఇంటి కొచ్చాడు. భోజనం చేసి ఇంట్లోనే నిద్రపోయాడు. అదే రోజు రాత్రి ఇంట్లో ఫ్యానుకు ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆదివారం ఉదయం కుటుంబీకులు గుర్తించారు. కుమారుడి మృతితో మనో వేదనకు గురై జీవితంపై విరక్తితో తన భర్త ఆత్మహత్య చేసుకున్నాడని భార్య మాధవి పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

ఫ్యాన్‌కు ఉరి వేసుకొని మహిళ..

పటాన్‌ చెరు టౌన్‌: ఉరి వేసుకొని మహిళ ఆత్మహత్య చేసుకున్న ఘటన పటాన్‌చెరు పోలీస్‌స్టేషన్‌ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల కథనం మేరకు.. మెదక్‌ జిల్లా రేగోడు మండలం మర్పల్లికి చెందిన నరేశ్‌ రెడ్డి, రమ్యకృష్ణ బతుకుదెరువు కోసం పటాన్‌చెరు వచ్చి శ్రీనగర్‌ కాలనీలో ఉంటున్నారు. నరేశ్‌ రెడ్డి మదీనాగూడలోని ప్రైవేటు పాఠశాలలో పని చేస్తున్నాడు. జహీరాబాద్‌ మండలం మల్చల్మ గ్రామంలో అత్తగారి ఇంటి వద్ద ఉన్న భూమిని నరేశ్‌ రెడ్డి అన్నాదమ్ముళ్లు పంచుకున్నారు. తన భర్తకు తక్కువ భూమి వచ్చిందని, అయినా భర్త అడగడం లేదని మనస్తాపంతో ఇంట్లో ఫ్యాన్‌ కు చీరతో ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకుంది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యానికి బానిసై వ్యక్తి..

గజ్వేల్‌రూరల్‌: వ్యక్తి ఆత్మహత్యకు పాల్పడిన ఘటన గజ్వేల్‌ పట్టణంలో చోటు చేసుకుంది. గజ్వేల్‌ పోలీసుల కథనం మేరకు.. పట్టణానికి చెందిన అటుకూరి నర్సింలు(39)కు జ్యోతితో 16 ఏళ్ల కిందట వివాహం జరిగింది. వీరికి ఇద్దరు కుమారులు. నర్సింలు టైల్స్‌ పనిచేస్తూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నాడు. మద్యానికి బానిసైన నర్సింలును భార్య జ్యోతి పలుమార్లు మద్యం తాగొద్దంటూ వారించింది. శనివారం రాత్రి సైతం భార్యాభర్తల మధ్య మరోసారి వాగ్వాదం జరిగింది. దీంతో జ్యోతి ఇంట్లో నుంచి బయటకు వెళ్లిపోగా ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు గజ్వేల్‌ ప్రభుత్వాస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. బాధిత కుటుంబ సభ్యులు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు గజ్వేల్‌ సీఐ సైదా తెలిపారు.

మక్తభూపతిపూర్‌ గ్రామంలో యువకుడు..

హవేళిఘణాపూర్‌(మెదక్‌): ఉరి వేసుకొని యువకుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన మండల పరిధిలోని మక్తభూపతిపూర్‌ గ్రామంలో ఆదివారం చోటు చేసుకుంది. గ్రామానికి చెందిన కొమ్ము గోపాల్‌(26) ఉపాధి కోసం పెయింటర్‌గా పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. శనివారం రాత్రి కుటుంబ సభ్యులతో కలిసి నిద్రించాడు. ఆదివారం తెల్లవారుజామున అందరూ నిద్రలేచి చూసేసరికి ఉరి వేసుకొని వేలాడుతూ కనిపించాడు. విషయం తెలుసుకున్న మెదక్‌ రూరల్‌ పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మెదక్‌ ఆస్పత్రికి తరలించారు. గోపాల్‌ మృతిపై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని, ఫిర్యాదు వచ్చిన వెంటనే విచారణ చేపడుతామని మెదక్‌ రూరల్‌ పోలీసులు తెలిపారు.

బంక్‌లో రూ.4,200కి రూ.42,001 ట్రాన్స్‌ఫర్‌

- చేతివాటం ప్రదర్శించిన వర్కర్‌
- పోలీసుల జోక్యంతో సమస్య పరిష్కారం

చేర్యాల(సిద్దిపేట): పెట్రోల్‌ బంక్‌ వర్కర్‌ చేతివాటంతో ఓ వినియోగదారుడికి అన్యాయం జరిగిన ఘటన పట్టణ కేంద్రంలో ఆదివారం వెలుగుచూసింది. బాధితుడి కథనం మేరకు.. జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం కట్కూరు(సోలామైల్‌) గ్రామానికి చెందిన వినియోగదారుడు తన ఆటో, క్యానులో పట్టణ కేంద్రం నుంచి జనగామ వెళ్లే దారిలోని ఓ పెట్రోల్‌ పంప్‌లో శనివారం రూ.4,200ల డీజిల్‌ను కొనుగోలు చేశాడు. డబ్బులను మొబైల్‌ నుంచి ఫోన్‌ పే ద్వారా చెల్లింపు చేసుకోమని బంక్‌లో పని చేసే వర్కర్‌కి మొబైల్‌ ఇవ్వగా సదరు వర్కర్‌ రూ.4,200లకు బదులు రూ.42,001లు ఫోన్‌ పే చేసుకున్నాడు. ఇది గమనించకుండా ఇంటికెళ్లిన వినియోగదారుడు ఆదివారం తన ఖాతాలో బ్యాలెన్స్‌ తక్కువ ఉండడంతో అనుమానం వచ్చి ఫోన్‌ పే లావాదేవీలు పరిశీలించాడు. వెంటనే బంక్‌ వర్కర్‌కి ఫోన్‌ చేసి అడిగితే సరైన సమాధానం చెప్పలేదు. బంక్‌ వద్దకు వచ్చి బాధితుడు గొడవ చేయగా నిర్వాహకులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. వర్కర్‌ని పోలీస్‌స్టేషన్‌కి రప్పించి బాధితుడి డబ్బు తిరిగి ఫోన్‌ పే ద్వారా చెల్లింపు చేయించడంతో సమస్య సద్దుమనిగింది.

ప్రాణం తీసిన ఈత సరదా

- డ్యామ్‌లో మునిగి ఇద్దరు యువకులు మృతి
- సంగారెడ్డి మండలంలో తీవ్ర విషాదం



మృతదేహాల వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

సంగారెడ్డి టౌన్‌: సరదా కోసం ఈతకు వెళ్లి ఇద్దరు యువకులు మృతి చెందిన ఘటన సంగారెడ్డి మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు, బంధువుల కథనం మేరకు.. సంగారెడ్డి పట్టణానికి చెందిన అష్రఫ్‌ (16), మండల పరిధిలోని ఇస్మాయిల్‌ ఖాన్‌ పేటకు చెందిన అఫ్రోజ్‌ (16) వరుసకు బావ బామ్మర్దులు. వెడ్డింగ్‌ షాపులో పని చేస్తూ జీవనం సాగిస్తున్నారు. సరదా కోసం ఆదివారం మండల పరిధిలో కలబ్‌ గూర్‌ మంజీరా డ్యామ్‌లోకి ఈతకు వెళ్లారు. ఈ క్రమంలో ప్రమాదవశాత్తు నీట మునిగి ఇద్దరూ మృతి చెందారు. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న బంధువులతోపాటు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతుల బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు వివరించారు.


మట్టి తరలిస్తున్న జేసీబీ, ట్రాక్టర్లు సీజ్‌



పోలీసులు సీజ్‌ చేసిన జేసీబీ, ట్రాక్టర్లు

చిన్నశంకరంపేట(మెదక్‌): అనుమతులు లేకుండా అక్రమంగా మట్టిని తరలిస్తున్న జేసీబీ, నాలుగు ట్రాక్టర్లను సీజ్‌ చేసి కేసు నమోదు చేసినట్లు పేట ఎస్‌ఐ నారాయణగౌడ్‌ తెలిపారు. ఆదివారం ఉదయం మండలంలోని కొర్విపల్లి చర్చి సమీపంలో మట్టిని అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారం మేరకు పట్టుకున్నట్లు తెలిపారు. శంకరంపేటకు చెందిన రమేశ్‌గౌడ్‌ మట్టిని తరలిస్తున్నారని గుర్తించి కేసు నమోదు చేశామన్నారు.

బెజ్జంకి(సిద్దిపేట) : మండలంలోని గాగిల్లాపూర్‌ నుంచి ఇసుక అక్రమ రవాణా చేస్తున్న ట్రాక్టర్‌ను ఆదివారం పట్టుకొని పోలీస్‌ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్‌ఐ క్రిష్టారెడ్డి తెలిపారు.



బీమా.. పనికి ధీమా

భవన నిర్మాణ కార్మికులకు భరోసా

- కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాలతో చేయూత
- ప్రమాదాలు జరిగితే రూ.లక్షల్లో సాయం
- 2009లో మొదలైన కార్మిక పథకం
- పేర్లు నమోదు చేసుకోవడమే ఆలస్యం



కోహెడలో బిల్డింగ్‌ వర్క్‌ చేస్తున్న కార్మికులు

కోహెడరూరల్‌(హుస్నాబాద్‌): భవనం నిర్మించాలంటే సుమారు పది రంగాల కార్మికులు పని చేస్తుంటారు. ఇంటి నిర్మాణం జరిగేటప్పుడు ప్రమాదాల బారిన పడి కార్మికులు మృతి చెందడం, గాయపడటం వంటివి జరుగుతుంటాయి. అలాంటి సమయంలో కార్మికులకు భరోసానిస్తూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పథకాలను ప్రవేశపెట్టాయి.

2009లో పథకానికి నాంది..

గతంలో భవన నిర్మాణ రంగాల్లో పని చేసే కార్మికులు ప్రమాదాలకు గురైనా, ప్రమాదవశాత్తు భవనం పైనుంచి పడి మృతి చెందినా, కాళ్లు, చేతులు విరిగినా ఆదుకునే వారు లేరు. దీంతో నిర్మాణ కార్మికుల కోసం 2009లో ఉమ్మడి ఏపీ మాజీ సీఎం వై.ఎస్‌ రాజశేఖర్‌ రెడ్డి కార్మికులకు ఆర్థిక సాయం అందించేందుకు ఉత్తర్వులు జారీ చేసి తెలంగాణ భవన, నిర్మాణ కార్మిక సంక్షేమ మండలిని ఏర్పాటు చేశారు.

దరఖాస్తు ఇలా...

పథకానికి లబ్ధి పొందాల్సిన కార్మికులు ఆధార్‌ కార్డు, రేషన్‌కార్డు, బ్యాంక్‌ అకౌంట్‌తోపాటు రెండు పాస్‌పోర్టు సైజు ఫొటోలతో మీ సేవా కేంద్రంలో దరఖాస్తు చేసుకోవాలి. అనంతరం మీ సేవలో ఇచ్చిన రసీదుతోపాటు గుర్తింపు కార్డులతో కార్మిక శాఖ కార్యాలయంలో అందజేయాలి. అక్కడి అధికారులు అర్హులైన వారి పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి తెలంగాణ కార్మిక శాఖ లేబర్‌ కార్డును మీ సేవ ద్వారా అందజేస్తారు.

కేంద్ర ప్రభుత్వం ఈ శ్రమ్‌



అసంఘటిత రంగ కార్మికుల కోసం కేంద్ర ప్రభుత్వం రెండేళ్ల కిందట ఈ శ్రమ్‌ పోర్టల్‌ తీసుకొచ్చింది. ఇందులో పేర్లు నమోదు చేసుకున్న కార్మికులకు సామాజిక భద్రత తోపాటు వివిధ సంక్షేమ పథకాల ను అందించడానికి చర్యలు తీసుకుంటుంది. ప్రతీ అసంఘటిత కార్మికుడికి 12 అంకెల ప్రత్యేక గుర్తింపు కార్డు అందజేస్తారు. ఈ కార్డు ఉంటేనే కేంద్ర ప్రభుత్వం అందించే అన్ని రకాల సామాజిక భద్రత పథకాలు వివిధ సంక్షేమ పథకాలు వర్తిస్తాయి. నమోదు చేసుకున్న ప్రతీ కార్మికుడికి ఏడాది పాటు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన కింద రూ.2 లక్షల ప్రమాద మరణం, అంగవైకల్య బీమా ఉచితంగా కల్పిస్తారు.

ఎవరెవరూ అర్హులంటే..

తాపీ పని వారే కాకుండా, కార్పెంటర్లు, ఎలక్ట్రీషియన్లు, రంగులు వేసేవారు, ప్లంబర్లు, ఐరన్‌ వర్కర్లు, మెస్త్రీలకు సాయం చేసేవారు సభ్యత్వ నమోదు చేసుకోవాలి. 18 ఏళ్ల నుంచి 60 ఏళ్ల లోపు వారు అర్హులు. తెలంగాణ భవన మండలిలో మొదటి సారి సభ్యత్వం కోసం మీ సేవ కార్యాలయంలో రూ.110 చెల్లించి పేరు నమోదు చేసుకోవాలి. ఒక్కసారి నమోదు సభ్యత్వం పొందితే ఐదేళ్ల వరకు ఉంటుంది. అనంతరం రూ.60 చెల్లించి రెన్యూవల్‌ చేసుకోవాలి.

కార్మికులకు చేకూరే లబ్ధి

కార్మికులు ప్రమాదంలో చనిపోతే రూ.6 లక్షలకు పైగా సాయం అందుతుంది. సాధారణ మరణం పొందిన రూ.1 లక్షకు పైగా కుటుంబానికి ఇస్తారు. అలాగే, అడ పిల్లల పెళ్లిలకు, ప్రసూతి సాయం కోసం రూ.30 వేల సాయం అందుతుంది. దీంతో పాటు పలు రకాల పథకాలు కార్మికుల కుటుంబాలకు అందిస్తూ ప్రభుత్వం భరోసా కల్పిస్తుంది.